రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.40, బీరకాయ రూ.38, క్యాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.21, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.40, మునగ రూ.23, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.15, కీర రూ.21, క్యాప్సికమ్ రూ.37. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఆలుకొండ అంజలి అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని కోరడంతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పగడాల శ్రీశైలం, సైదులు, రేణుక, లింగ స్వామి, జయశ్రీ, పగడాల ఏల్లన్న, పగిళ్ళ అంజి, సంతోష, శ్వేత, ప్రశాంత్, వసుదేవుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న రుద్రాల స్వామి

నాగోలు: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్, గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీ వారు 2025 గాను ఎల్‌బీనగర్ చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రుద్రాల స్వామి మాదిగకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈనెల 23 న పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో మైసూర్ విభ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ అంబికా నజరత్ ప్రెసిడెంట్ దుర్గానిధి స్టాలిన్, గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ జార్జ్ ఫ్రెయండ్ పీటర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఆస్తి పన్ను వసూలులో టాప్

చాదర్‌ఘాట్: ఆస్తిపన్ను వసూళ్లలో చార్మినార్ జోన్‌లో మలక్‌పేట సర్కిల్–6 ముందంజలో ఉందని సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 31 వరకు రూ. 37 కోట్లు ఆస్తిపన్ను టార్గెట్ కాగా మంగళవారం వరకు రూ.30 కోట్లు వసూలు చేసి జోన్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. మార్చి 31లోగా మరో రూ. 3 కోట్లు వసూలు చేయనున్నట్లు తెలిపారు. జోన్ పరిధిలో 8 సర్కిళ్లు ఉండగా సర్కిల్–6 టాప్‌గా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు, బిల్ కలెక్టర్లను అభినందించారు.

అభినందనలు


అభిషేక్‌ను సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: స్పెయిన్‌లో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అభిషేక్‌ను మంగళవారం టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, మేడ్చల్ మల్కాజి గిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచిన అభిషేక్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

20 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

సైదాబాద్: తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంగటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సైదాబాద్ లోకాయుక్త కాలనీకి చెందిన అస్రా ఫాతిమా కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి షాపింగ్ నిమిత్తం చార్మినార్ ప్రాంతానికి వెళ్లారు. సోమవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులకొట్టి ఉండటాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి చూడగా అల్మారాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, మూడు సెల్ ఫోన్లు, వాచ్ కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాడలేని ఫాగింగ్..


సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం

విజృంభిస్తున్న దోమలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంబంధిత అధికారులు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో దోమల విజృంభిస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాల్సి ఉండగా సిబ్బంది అటు వైపు రావడం లేదన్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో డ్రైనేజీ పొంగిపొర్లుతోందని దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఆస్తిపన్నుల వసూళ్లలో ముందుండే అధికారులు సమస్యల పరిష్కారించడానికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. సమస్యలు పరిష్కరించకుంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

నాలాలు, చెరువు పరిసర ప్రాంతాల్లో మరీ దారుణం..

సరూర్‌నగర్ చెరువు, చెరువుకు వచ్చే ప్రధాన నాలాలకు ఆనుకొని ఉన్న కాలనీల వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందనే చెప్పాలి. సరూర్‌నగర్ చెరువులో మురుగు చేరుతుండటంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు గుర్తు తెలియన్ని వ్యక్తులు నిత్యం దూర ప్రాంతాల నుంచి చెత్త తీసుకొచ్చి చెరువులో పడేస్తున్నారు. దీంతో మరింత దుర్గాంధంగా మారుతోందని చెబుతున్నారు. ప్రధానంగా గ్రీన్‌పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ ఫేజ్ 1, 2, శ్రీనివాస్‌కాలనీ, వడ్డెరబస్తీ, శ్రీరామ్‌నగర్ కాలనీ తదితర కాలనీల ప్రజలు సాయంత్రం దాటితే ఇంట్లో నుంచి కూడా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి..

చెరువు ఆనుకొని ఉన్న కాలనీవాసులు తమ పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నారు. చెరువు చుట్టూ రక్షణ లేకపోవడంతో ఆడుకుంటూ ఎక్కడ చెరువులో పడుతారోననే భయం తల్లిదండ్రులకు ఉంది. గతంలో కొంత మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మళ్లీ ఫెన్సింగ్ పనులు పునరుద్ధరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

చెరువులో చెత్తను తొలగించాలి..

డివిజన్ పరిధిలో ఫాగింగ్ సరిగా నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 15 రోజులకు ఒకసారైనా ఫాగింగ్ చేసేవారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో వారానికి కనీసం రెండు సార్లు ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు. అలాగే చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.


కూలిపోయిన ఫెన్సింగ్

రెండుసార్లు ఫాగింగ్ చేయాలి

సాయంత్రమైతే తలుపులు తెరవలేని పరిస్థితి ఏర్పడింది. చెరువులో మురుగుతో పాటు చెత్తాచెదారం పేరుకుపోతోంది. దీంతో చెరువు పరిసరాలు దుర్గాంధంగా మారాయి. ఎంటమాలజీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయాలి.

– శివ, గ్రీన్‌పార్కుకాలనీ

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి


బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపో నుంచి గతంలో నడిచిన 100 జీ, ఎల్, ఎల్/జీని పునరుద్ధరించాలని బీజేపీ సీనియర్ నాయకులు చరణ్‌రెడ్డి, నాగోలు డివిజన్ అధ్యక్షులు పంగా శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బండ్లగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బండ్లగూడ నుంచి జీఎస్‌ఐ, మాన్సురాబాద్, ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ వరకు, జీఎస్‌ఐ, బండ్లగూడ, నాగోలు, కొత్తపేట్, దిల్‌సుఖ్ నగర్ వరకు నడుస్తున్న బస్సులను పాత రూట్ ప్రకారం నడిపించాలని కోరారు. బండ్లగూడ డిపో నుండి కొత్తగా పసుమాముల, కుంట్లూరు, అన్నారం, బండ్లగూడ మీదిగా నాగోలు, జేబీఎస్ బస్టాండ్ వరకు, మరోక బస్సును పెద్ద అంబర్‌పేట నుంచి కుంట్లూరు మీదుగా అన్నారం, బండ్లగూడ డిపో, నాగోలు, దిల్‌సుఖ్‌నగర్ వరకు నడపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాలం శెట్టిలయ, చంద్రశేఖర్ గుప్తా, మల్లెల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కే పురం వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో వాసవీ కాలనీ అష్టలక్ష్మి మహిళా మండలి రజతోత్సవాలకు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కె.సుజాత గుప్తాతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళా మండలికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. 25 ఏళ్లుగా మహిళా మండలి నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి, రంగా నరసింహ గుప్తా, కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, నాయకులు అరవింద్ శర్మ, పెండ్యాల నగేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీ మన్నారాయణ, మధుర ఉపేందర్ రెడ్డి, రాజ్యలక్ష్మి, అరుణ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన



సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో ఉన్నత పాఠశాల నిర్మించాలని స్థానిక నాయకులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ముకుంద రెడ్డి, సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీ, డీఈఓ రోహిణి, సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి రాధాకృష్ణ కాలనీలోని సరళాదేవి హట్స్ ప్రైమరీ పాఠశాలను, సమీపంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్నత పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్, అలివేలు, సాయిలక్ష్మి, సంతోషి, శ్రీను నాయక్, పావని పాల్గొన్నారు.

పార్కు స్థలం పరిశీలన



మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని శివగంగా కాలనీలోని పార్కు స్థలం శివం హిల్స్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసినట్లు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్యాంసన్, టీపీఓ అక్బర్ పార్కు స్థలాన్ని పరిశీలించారు. కబ్జాదారుడి ఇంటి పత్రాలను పరిశీలించి పార్కు స్థలాన్ని కబ్జా చేసినట్లు నిర్ధారించారని, సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రహరీ నిర్మించి పార్కును అభివృద్ధి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు తొంట బాబు తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


ఎంఎస్ క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న నాగోలు సీఐ సూర్యనాయక్

నాగోలు: విద్యార్థులు, యువత అన్ని రంగాల్లో రాణించాలని నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ అన్నారు. మంగళవారం ఆయన నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ సాయి సుప్రభాత్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎంఎస్ క్రికెట్ అకాడమీని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ విజయ్ ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు సమర్థవంతమైన శిక్షణ అందించేందుకు ఇలాంటి అకాడమీల ఏర్పాటు అవసరమన్నారు. క్రీడా రంగంలో మెరుగైన అవకాశాలను అందించేందుకు, యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఎంఎస్ క్రికెట్ అకాడమీ దోహదపడుతుందన్నారు. ఎంఎస్ అకాడమీ నిర్వాహకులు శ్రీధర్ రెడ్డి, మురళి కుమార్ మాట్లాడుతూ, తమ అకాడమీలో అనుభవజ్ఞులైన కోచ్ లతో టఫ్ వికెట్ ట్రైనింగ్, బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, డ్రిల్స్, ఫిట్నెస్ సెషన్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ప్రొఫెషనల్ హెచ్.సి.ఏ కోచింగ్ వంటి అత్యాధునిక శిక్షణ అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాలురు, బాలికలకు శిక్షణ ఇచ్చి, వారిని ప్రొఫెషనల్ స్థాయికి తీసుకెళ్లే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఫిట్నెస్ ట్రైనర్ రమాకాంత్, విజయ్ కృష్ణ, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, యాదగిరి, రాజేశ్వర్‌రావు

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీ దుర్గా రాజరాజేశ్వరి త్రిశక్తి దేవాలయంలో జరిగిన 9వ వార్షికోత్సవానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను చాటి చెప్పాలన్నారు. ప్రధాన అర్చకులు దేశపతి నాగరాజుశర్మ నేతృత్వంలో చండీహోమం, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జూకంటి యాదగిరి, ప్రధానకార్యదర్శి కాటపల్లి రాజేశ్వర్‌రావు, కోశాధికారులు విష్ణువర్ధన్, జంగయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి విశాల్, ఉపాధ్యక్షులు నర్సింహ్మా, జంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, కృష్ణగౌడ్, స్థానిక నేతలు మందడి విజయ సింహారెడ్డి, బద్దం సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి



మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో పలు కాలనీల ప్రజలు లో ఓల్టేజీతో సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సరూర్‌నగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) మాధవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మదర్ డైరీ పరిసర కాలనీల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. శ్రీసాయిగణపతి కాలనీ కమ్యూనిటీహాల్‌కు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, మరో ప్రాంతానికి తరలించాలన్నారు. ఎస్‌ఈ మాధవరెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.



పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నందుకు పోలీసులు మందలించడంతో వారిపై దాడికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిచారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 23 రాత్రి మల్లికార్జున్‌నగర్‌కాలనీలోని బహిరంగ ప్రదేశంలో మీర్‌పేట అల్మాస్‌గూడ ప్రాంతానికి చెందిన యశ్వంత్ రెడ్డి అనే వ్యక్తి మద్యం తాగుతుండగా కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు అతడిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో అతను డ్యూటీలో ఉన్న సిబ్బందిపై దాడిచేసి విధులకు ఆటంకం కలిగించారు. అతనిడి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా అక్కడ కూడా తాగిన మైకంలో నానా హంగామా చేసి పోలీసులను బూతులు తిట్టాడు. యశ్వంత్‌రెడ్డి పై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అతడిని అరెస్ట్ చేసి హయత్‌నగర్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

30న అష్టలక్ష్మి దేవాలయంలో పంచాంగ పఠనం

దిల్‌సుఖ్‌నగర్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30 ఆర్‌కేపురం వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, నూతన పంచాగం ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 30న దేవాలయంలో సహస్రనామార్చన స్వామి సువర్ణ వస్త్ర అలంకరణ, ఆరగింపు నిత్య హోమం బలిహరణాది పూజలు, స్వామివారి సన్నిధిలో మంగళాశాసనం, ఉగాది పచ్చడి ప్రసాద వినియోగం, సుందరకాండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేనారాధన. పంచాంగాలకు ఆరాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం దేవాలయ ప్రధాన అర్చకులు మరిగంటి లక్ష్మీ నరసింహాచార్యస్వామిచే పంచాంగ ఆవిష్కరణ, అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకకరమంలో దేవాలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్ కోశాధికారి అయిత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్ కుమార్ మాజీ చైర్మన్లు బంధం దామోదర్. తేలుకుంట్ల రమేష్ .మేడం సుధాకర్ గుప్తా, సెక్రెటరీ దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొననున్నట్లు తెలిపారు.

నీటి వృథాను అరికడదాం


నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హస్తినాపురం: నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జలసంరక్షణపై అందరికీ అవగాహన అవసరమని జలమండలి జీఎం. బలరామరాజు అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని జలమండలి, సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు నీటి వినియోగం ఇంకుడుగుంతల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామరాజు మాట్లాడుతూ నీరు ఎక్కడైనా వృథా అవుతున్నట్లు గుర్తిస్తే దానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణ పద్ధతులపై జలమండల సిబ్బందిని, సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించవచ్చునని జీఎం సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రవీంద్రవర్మ, సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సురేందర్, ఏటీవో నర్సింగ్‌రావు, అఖిల్, రామచంద్రవర్ధన్, పాఠశాల ప్రిన్సిపాల్ మేడ నందితారెడ్డి, డైరక్టర్ గోపాల్‌రెడ్డి, అరుణశ్రీ, అనూషరెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

హయత్‌నగర్: భవిష్యత్తులో నీటి ఎద్దడి రాకుండా సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీఎస్ ఆర్టీసీ ఆర్‌ఎంఓ శంకర్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మంగళవారం హయత్‌నగర్ ఆర్టీసీ 1,2 బస్ డిపోలలో సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నీరు, ఇతర ప్రకృతి వనరులను రక్షించి భావి తరాలకు అందించేందుకు ఆర్టీసీ కార్మికులు తమ వంతు కృషి చేయాలన్నారు. నీటిని పొదుపుగా వాడడమే కాకుండా రీసైకిల్ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నీటి వినియోగంపై తమ పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీడ్స్ సంస్థ సీఈఓ నాగబ్రహ్మాచారి మాట్లాడూ నీటి వినియోగం, సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏడాది పొడుగునా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నీరు, గాలిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సీఐ యాదగిరి, డీఎంలు శ్రీనివాస్, విజయ్‌కుమార్, డీజీఎం రాజగోపాల్, అసిస్టెంట్ మేనేజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం అధికారులతో కలిసి అక్బర్‌బాగ్ ఉజాలేషాహ ఈద్గాలను సందర్శించారు. ఈ సందర్భంగా రంజాన్ పండుగ నమాజ్ ఈద్ ఉల్ ఫితర్ కోసం ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, పారిశుద్ధ్య, విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. డివిజన్ కార్పొరేటర్ సయ్యద్, మినాజుద్దీన్, ఏఎంహెచ్‌వో శ్రీనివాస్, వాటర్ వర్క్స్ డీజీఎం అస్మత్ అలీ, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, జవాన్ యాదగిరి, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ రామకృష్ణ దేవాలయంలో మంగళవారం శ్రీ అలివేలు, మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు కార్పొరేటర్‌కు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.కార్యక్రమంలో నాయకులు లెనిన్‌రెడ్డి, నరసింహ, విజయలక్ష్మీ, రామచంద్రం. శంకర్, శ్యాంసుందర్, శ్రీనివాస్, శేఖర్, మల్లేష్‌గౌడ్, నరసింహగౌడ్, లింగస్వామి, నాగరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు


హరిపురికాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

దిల్‌సుఖ్‌నగర్: రోడ్లపై చెత్త, వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత అన్నారు. మంగళవారం ఆమె ఆర్‌కేపురం డివిజన్, హరిపురికాలనీ రోడ్డు నెంబర్ 1లో జీహెచ్‌ఎంసీ అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో పశువుల కొట్టం నిర్వహిస్తూ అసౌకర్యానికి గురి చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుపై చెత్త వేస్తే సహించేది లేదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాలనీలో అపరిశుభ్ర వాతావరణంలో సమోసాలు తయారు చేస్తున్న వారికి ఫైన్ వేశారు. కార్యక్రమంలో డీఈ చందన, కాలనీ వాసులు చంద్రశేఖర్, శ్రీకాంత్, శరణ్, నాగుల మీరా, గోపీ కృష్ణ, హరినివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బెనివాల్ పాల్గొన్నారు.